AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



2



కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

2

రేపు 'ఓట్ బచావో దేశ్ బచావో' సమావేశం



అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో మంగళవారం ఓట్ బచావో దేశ్ బచావోపై సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యకమనికి ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ఆసన్ మౌలానా హాజరు కానున్నారు. అందులో భాగంగా ఆయన సోమవారం సాయంత్రానికే కామారెడ్డికి చేరుకోనుండగా హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ స్వాగతం పలికారు.



కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి

అక్షరటుడే, ఇందూరు: ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుక లను సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. సమాజంలో సత్ప్రవర్తన, సమానత్వం, సోదర భావం పెంపొందించేందుకు వాల్మీకి బోధనలు ఎంతగానో దోహదపడతా యన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయికుమార్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్, బీసీ సంఘాల నాయకులు బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్, బస్సాపూర్ శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుతోనే ఫేక్ ఐడీలు..!



అక్షరటుడే, కామారెడ్డి: సోషల్ మీడియా సైబర్ నేరగాళ్లకు వేదికగా మారింది. ఈ వేదికగా అమాయక ప్రజలతో పాటు అధికారులు, రాజకీయ నాయకులను సైబర్ ఉచ్చులోకి లాగుతున్నారు. ఇటీవల సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లో ఫేక్ ఐడీలతో అకౌంట్స్ క్రియేట్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.

తాజాగా కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేరు మీద ఫేక్ ఐడీలను సృష్టించారు. వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్‌లలో ఫేక్ ఐడీలు సృష్టించి వైరల్ చేస్తున్న విషయాన్ని కలెక్టర్ గ్రహించారు. నష్టం జరగకముందే స్పందించిన ఆయన వెంటనే దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టుగా తెలుస్తోంది. కలెక్టర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఫేక్ ఐడీ క్రియేట్ చేసిన వారి వివరాలు గుర్తించే పనిలో పడ్డారు. ఈ ఫేక్ ఐడీల ద్వారా కలెక్టర్ పేరు చెప్పి పలువురికి మెసేజ్‌లు పెట్టి డబ్బు డిమాండ్ చేసే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. సాధారణంగా సైబర్ నేరగాళ్లు అధికారుల పేర్లతో ఫేక్ ఐడీలు సృష్టించి, వారి సన్నిహితులకు, ఉద్యోగులకు మెసేజ్ లు పంపి డబ్బు వసూలు చేయడం, వ్యక్తిగత సమాచారం సేకరించడం చేస్తుంటారని పోలీసులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో అధికారుల ఫొటోలు, పేర్లు వాడి ఫేక్ ఐడీలు సృష్టించడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ జిల్లాలో పలువురు రాజకీయ నాయకులు, అధికారుల పేరిట ఇలాంటి ఫేక్ ఐడీలు సృష్టించి మోసాలకు పాల్పడిన ఘటనలు జరిగాయి. కొందరు అమాయక ప్రజలు అదే అధికారి అకౌంట్ అని నమ్మి మెసేజ్‌లకు స్పందిస్తారు. ఆ తర్వాత డబ్బు అడగడం, ఓటీపీలు అడగడం, లింకులు పంపడం ద్వారా మోసానికి పాల్పడుతారు. ఈ విషయంలో కలెక్టర్ ముందస్తుగా ఫిర్యాదు చేశారు.

చిక్కిన ఏటీఎం దొంగ

- గాంధారి ఏటీఎం చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడి అరెస్ట్
- రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పరారీలో మిగతా నిందితులు
- వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

గాంధారి ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులకు ఛేదించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలించి.. ఎట్టకేలకు రాజస్థాన్‌లో ముఠా సభ్యుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్పీ రాజేశ్ చంద్ర సోమవారం వివరాలు వెల్లడించారు. పలువురు నిందితులు ఇంకా పరారీలో ఉన్నారని చెప్పారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి



గాంధారి మండల కేంద్రంలో ఈనెల 10 న ఏటీఎంలో రూ.25 లక్షల చోరీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఏటీఎం చోరీకి పాల్పడిన ముఠాలో ఒక వ్యక్తి పోలీసులకు చిక్కాడు. 15 రోజులుగా ముమ్మర విచారణ చేస్తున్న పోలీసులకు చివరికి విజయం దక్కింది. రాజస్థాన్‌లో పోలీసులకు చిక్కకుండా ముప్పతిప్పలు పెట్టిన దొంగను రాజస్థాన్ పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుడిని విచారిస్తే మిగతా నిందితుల జాడ తెలిసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

మరికొందరి కోసం గాలింపు..

చోరీ కేసులో ఒకరు పట్టుబడినప్పటికీ మిగతా దొంగలు ఇంకా పోలీసులకు చిక్కలేదు. మిగితా వారికోసం మరో మూడు బృందాలు ఇతర రాష్ట్రాల్లో తిరుగుతున్నాయి. హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నట్టుగా సమాచారం. పట్టుబడిన నిందితుడి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మిగతా వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మిగతా నిందితులు ఎక్కడ దాక్కున్నారో గుర్తించేందుకు పోలీసులు టెక్నికల్ ఆధారాలు, సీసీ టీవీ పుటేజీలు, మొబైల్ లొకేషన్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలు చేపడుతున్నట్టుగా సమాచారం.

ఇతర జిల్లాలలో చోరీలపై విచారణ..

ఈ దొంగల ముఠాకు ఇతర జిల్లాల్లో జరిగిన ఏటీ ఎం చోరీలతో సంబంధం ఉందని పోలీసులు అనుమాని స్తున్నారు. గత నెలలో కరీంనగర్‌లో జరిగిన చోరీలో ఇదే ముఠా పాల్గొన్నట్టుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఉమ్మడి జిల్లా, ఇతర జిల్లాలలో జరిగిన ఏటీఎం చోరీ కేసులతో ఈ కేసుకు ముడిపడి ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్టుగా సమాచారం. ఇదే ముఠా గతంలో కూడా ఎక్కడైనా చోరీలు చేసిందా అనే విషయంపై కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంలే టార్గెట్‌గా ఈ ముఠా చోరీలకు పాల్పడుతుందనే అనుమానం పోలీసుల్లో వ్యక్తమవుతోంది. ఈ ముఠా గాంధారితో పాటు ఇతర జిల్లాల్లో కూడా అదే పద్ధతిలో చోరీలు చేసిందా అనే కోణంలో పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. పట్టుబడిన నిందితుడి గత చరిత్ర గురించి కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

కారు, ఆయుధాలు స్వాధీనం

పట్టుబడిన నిందితుడి వద్ద నుంచి పోలీసులు కీలకమైన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద స్కార్పియో వాహనం, చోరీకి వాడిన ఆయుధాలు, రూ.29,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగలు చోరీకి ఈ స్కార్పియో వాహనంలోనే వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, నగదు, వాహనాన్ని పోలీసులు సాక్ష్యాలుగా సేకరించారు. చోరీ చేసిన రూ.25 లక్షల్లో పంపకాలు జరగగా కొంత డబ్బుతో బైక్ కూడా కొన్నట్టుగా పోలీసులు గుర్తించారు.

మిగతా దొంగలు చిక్కేనా..?

గాంధారి ఏటీఎం చోరీ కేసులో ఒకరు చిక్కినప్పటికీ మిగతా దొంగలు పోలీసులకు చిక్కేనా అనే చర్చ జరుగుతోంది. చిక్కిన నిందితుడిని విచారిస్తే మిగతా వారి జాడ తెలిసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మిగతా వారికోసం పోలీసుల వేట కొనసాగుతోంది. గాంధారి ఏటీఎం చోరీ కేసు ఛేదనకు పోలీసులు అడుగు దూరంలో ఉన్నారనే చర్చ జరుగుతోంది. మిగతా నిందితులు కూడా త్వరలోనే పోలీసులకు చిక్కుతారనే ధీమా పోలీసుల్లో వ్యక్తమవుతోంది. ప్రజలు కూడా మిగతా దొంగలు ఎప్పుడు చిక్కుతారా అని ఎదురుచూస్తున్నారు. ఈ చోరీ కేసును చేదిస్తే ఫేక్ కరెన్సీ తరహాలో మరొక క్రెడిట్ జిల్లా పోలీసు శాఖకు దక్కనుంది.



సింగూరు నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా

అక్షరటుడే, కామారెడ్డి: ఎల్‌నినో ప్రభావం తో సింగూరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో నీటి సరఫరాను రోజు విడిచి రోజు అందించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బాన్సువాడ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్..

ఈ నెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాలకు, 29న బాన్సువాడ, బోధన్ నియో జకవర్గాలకు పెద్దమొత్తంలో నీటిని సరఫరా చేయనున్నట్టుగా పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అలాగే అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు. నీటి కొరతను అధిగమించేందుకు ప్ర జలందరూ సహకరించాలని ఈఈ ఎస్. స్వప్న విజ్ఞప్తి చేశారు.

బాల్కొండ ఇన్‌ఛార్జి ఎస్సైగా యాసిర్ అర్ఫాత్



అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ పోలీ స్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఎస్సైగా యాసిర్ అర్ఫాత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాల్కొండలో ఎస్సైగా పనిచేసిన శైలేందర్ స్థానంలో ఆయనను నియమించినట్లు సమాచారం. యాసిర్ అర్ఫాత్ గతంలోనూ బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో కొన్ని నెలల పాటు విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతలు చేపట్టడంతో పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలపై దృష్టి సారించనున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్‌వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, పెండింగ్ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

మంత్రి సీతక్క పర్యటనపై పొచారం సమీక్ష



అక్షరటుడే, బాన్సువాడ : బాన్సువాడ మండ లంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక మాల్లో పాల్గొనేందుకు ఉమ్మడి నిజామాబాద్ ఇన్ ఛార్జి మంత్రి సీతక్క రానున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, నూతన భవనాల ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి మధ్యాహ్నం 2 గంటలకు కొయ్యగుట్ట తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తారు.

ఇందిరాగాంధీ స్టేడియాన్ని క్రికెట్‌కు కేరాఫ్ అడ్రస్ చేస్తాం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియాన్ని క్రికెట్ అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. సోమవారం హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, సీఈవో ఇంతియాజ్ ఖాన్, జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్‌తో కలిసి స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తామని తెలిపారు. ఆర్థిక కారణాలతో ప్రతిభ ఉన్న విద్యార్థులు శిక్షణకు దూరం కాకూడదని, స్థానికంగానే మెరుగైన అవకాశాలు కల్పిస్తామని అన్నారు. హెచ్‌సీఏ సహకారంతో స్టేడియంలో నాణ్యమైన క్రికెట్ పిచ్ నిర్మాణం చేపట్టి అండర్ 19 మ్యాచ్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల్లో ప్రైవేట్ క్రికెట్ కోచ్‌లను నియమిస్తామని, మూడు ప్రాక్టీస్ నెట్స్ ఏర్పాటు చేస్తామని, అవసరమైన క్రికెట్ సామగ్రిని అందజేస్తామని తెలిపారు. స్టేడియాన్ని హెచ్‌సీఏ ఆధీనంలోకి తీసుకునే అంశంపై త్వరలో జరిగే సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




అక్షరటుడే, ఆర్మూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో వినయ్‌రెడ్డి అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ఖాందేశ్ శ్రీనివాస్, ఆర్మూర్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, కౌన్సిలర్ సడక్ వినోద్, ఆర్మూర్, మాక్లూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్, వినోద్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబికా పవార్‌కు ప్రగతి రత్న అవార్డు



అక్షరటుడే, ఆర్మూర్: విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న ఆర్మూర్ లోటస్ స్మార్ట్ స్కూల్ వ్యవస్థాపకురాలు అంబికా పవార్ 'ప్రగతి రత్న అవార్డు' అందుకున్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అధునాతన టెక్నాలజీని తమ పాఠశాలలో అమలు చేస్తున్నందుకు గాను యూనిక్ లైఫ్ హైదరాబాద్ సంస్థ నాగోల్ లోని పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో అవార్డును యూనిక్ లైఫ్ ఫౌండర్ వేణు కళ్యాణ్, ప్రముఖ సినీ నటి శ్రేయా సరన్ అంబికా పవార్‌కు అందించారు.

మంచినీటి పథకాన్ని ప్రారంభించాలి



అక్షరటుడే,కోటగిరి: మంచినీటి పథకాన్ని వెంటనే ప్రారంభించాలని బీజేపీ మండల శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు, కల్లూరి బజరంగ్ (హన్మాండ్లు) మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని మంచినీటి పథకాన్ని ప్రారంభించాలని కోరారు. మండలంలోని ఉన్న అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో గంట్ల విఠల్, ఓమన్న పటేల్, సాయిలు, విజయ్, దత్తు, శ్రీనివాస్ మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల జననాన్ని ఆనందోత్సవంగా జరుపుకోవాలి



అక్షరటుడే, భీమ్‌గల్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా, వారి జననాన్ని ఆనందోత్సవంగా జరుపుకోవాలని సీడీపీవో జ్ఞానేశ్వరి సూచించారు. 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రిలో 'బేటీ జన్మోత్సవం' నిర్వహించారు. ఆస్పత్రిలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు శిశు సంరక్షణకు అవసరమైన బేబీ ప్రొడక్ట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం జ్ఞానేశ్వరి మాట్లాడుతూ బాలబాలికల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదని, సమానత్వ భావాలను అల వర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి, ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు విజయరాణి, శారద, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది, మహిళా సాధికారత విభాగం జెండర్ స్పెషలిస్ట్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అక్షరటుడే, డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి, వెస్లీ నగర్ తండా, సాంపల్లి, సాంపల్లి తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మెంట్రాజ్‌పల్లి సొసైటీ ఛైర్మన్ బోధనపు నవీన్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు ప్రవళిక, విజయ్, సంధ్య, సొసైటీ పాలకవర్గం సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేస్తాం



అక్షరటుడే, భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని భీమ్‌గల్ పట్టణ నాయకులు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను 12వ వార్డు అధ్యక్షుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రానున్న రోజుల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స అనంతరావు, చెప్పాల గణేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్దన్, 11వ వార్డు కౌన్సిలర్ సంగ్య నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ మమ్మరి సందీప్, మండల అధికార ప్రతినిధి వాక మహేష్, ఉపసర్పంచ్ మంద గోవర్ధన్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సేవాలాల్ తదితరులు పాల్గొన్నారు.



తిప్పాపూర్ పాలకేంద్రం కార్యవర్గానికి సన్మానం

అక్షరటుడే, భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ పాల కేంద్రం కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడిగా ఇల్లెందుల స్వామి రాజ్, డైరెక్టర్లుగా ఇల్లెందుల బాలరాజు, ధర్మగళ్ల మహేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు అత్తిలి శ్రీనివాస్, వంగేటి చిన్న నర్సారెడ్డి, దావరి సాయి రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ధర్మగల రాజయ్య, ఇల్లిందల ప్రభాకర్, రమేష్ రెడ్డి, రాజిరెడ్డి, రాజు అనిల్ తదితరులు పాల్గొన్నారు.






అంధకారంలో ఆహ్లాదం.. మినీట్యాంక్‌బండ్‌పై నిర్లక్ష్యమేలా..?

నగరంలోని రఘునాథ చెరువు ప్రాంగణంలో నిర్మించిన మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆహ్లాదం కరువైంది. సుమారు రూ.2.20కోట్లతో నిర్మించిన ఈ ట్యాంక్‌బండ్ ఆవరణలో ప్రస్తుతం చీకట్లు అలుముకున్నాయి. చెరువు పరిసరాల్లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్యాంక్ బండ్‌పై దారిపొడవున ఉన్న లైట్లలో సగానికి పైగా వెలగట్లేదు. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని ఆస్వాదించేందుకు వెళ్తే గేట్‌కు తాళం వేసి ఉంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే భద్రత కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పూర్తిగా ధ్వంసమైనా పట్టించుకునే నాథుడు లేడు. ప్రస్తుతం ఆ ప్రాంతం పోకిరీలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్





బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల



అక్షరటుడే, బాల్కొండ: కమ్మర్‌పల్లి మండలంలో అమీర్ నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త వర్ణం రాములు కుమారుడు వర్ణం నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో మానాల మోహన్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కోనసముందర్ గ్రామంలో దాసరి కమల ఇటీవల మృతి చెందగా.. వారి కుటుంబాన్ని సైతం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, సుంకేట రవి, బుచ్చి మల్లయ్య, పడిగేల ప్రవీణ్ రెడ్డి, మురళి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో పీజీ విద్యార్థులకు 202627కు గాను సోషల్ వర్క్ సబ్జెక్టులకు బోధించేందుకు రెండు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50శాతం మార్కులు ఉండాలని, పీహెచ్ డీ, నెట్, సెట్ అర్హతలతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి నియామకంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపిక ప్రక్రియ కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28న సాయంత్రం 4 గంటల్లోపు తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని, ఇంటర్వ్యూ 29వ తేదీ ఉంటుందని తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తున్న కౌన్సిలర్



అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని 8వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ముందుకెళ్తున్నారు. వార్డు పరిధిలోని కోర్ణ అశోక్ దంపతులకు ఇటీవల కూతురు జన్మించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా అశోక్ పాప పేరుపై పోస్ట్ ఆఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన పథకంలో రూ.10వేలు జమ చేశారు. దీనికి సంబంధించిన పాస్ బుక్‌ను పాప తండ్రి అశోక్‌కు అందజేశారు. పాప మేజర్ అయిన తర్వాత ఆ డబ్బులకు మిత్తితో కలిపి పెద్ద మొత్తంలో వస్తాయని సిద్ధి శ్రీధర్ గుప్తా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సిద్ధి శ్రీధర్ గుప్తా సొంత మేనిఫెస్టోను ప్రకటించి అమలు చేస్తున్నారు. వార్డు పరిధిలో ఆడ కూతురు జన్మిస్తే రూ.10 వేల నగదు, యువతి వివాహానికి రూ.11 వేలు, ఎవరైనా మరణిస్తే అంతక్రియలకు రూ.10వేల అందిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తర్వాత తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు. వార్డులో సొంతఖర్చులతో బోర్ బావులు తవ్వించి విధి మోటర్లను ఉచితంగా అందజేశారు. రాచర్ల సంతోష్, ఆఫీస్ పటేల్, కంచర్ల శ్రీధర్ గుప్తా తదితరులు ఉన్నారు.

నందిపేట్‌లో పామ్‌ఫాండ్స్ నిర్మాణం



అక్షరటుడే, నందిపేట్: వర్షం నీటిని నిలువు ఉంచేందుకు వీబీజీ రాంజీ పథకం ద్వారా గ్రామాల్లో పామ్‌ఫాండ్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. నందిపేట గ్రామానికి చెందిన రైతు తాద్వాయి ఎల్లాగౌడ్ పొలంలో పామ్‌ఫాండ్ పాండ్ నిర్మాణాన్ని సర్పంచ్ లింగం ప్రారంభించారు. రైతు పొలంలో 15-15 పరిమాణంలో పామ్‌ఫాండ్ నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పామ్‌ఫాండ్స్ ద్వారా వర్షం నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెరిగేందుకు దోహదపడుతుందన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలోని సీడబ్ల్యూసీ గోడౌన్ నుండి సారంగపూర్ షుగర్ ఫ్యాక్టరీ వరకు ఉన్న ప్రధాన రహదారి విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించాలని బీఆర్ఎస్ 13వ డివిజన్ ఇన్‌ఛార్జి మహ్మద్ అక్బర్ నవాజుద్దీన్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సదరు రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన బడ్జెట్ మంజూరై, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. కాని మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. అర్సపల్లి నుండి సీడబ్ల్యూసీ గోడౌన్ వరకు రోడ్డు పనులు కొద్దిరోజులు జరిగి మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఇందూర్ రోజ్ నర్సరీ వద్ద ఉన్న డీ51 కాలువ వంతెన కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్టు, దుస్తుల అందజేత



అక్షరటుడే, మాక్లూర్: మండలంలోని క్రికెట్ జట్టుకు గొట్టుముక్కల గ్రామ పంచాయతీ పాలకవర్గం సోమవారం క్రికెట్ కిట్‌తో పాటు దుస్తులను అందించింది. సర్పంచ్ సువర్ణ, ఉప సర్పంచ్ ఒడ్డెన్నలు వీటిని క్రీడాకారులకు అందజేశారు. ఆర్నెళ్ల క్రితం జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న గొట్టుముక్కల జట్టు కప్ సాధించింది. అందుకు గాను స్థానిక యువకులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

అక్షరటుడే, నందిపేట్: డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్షపడింది. మరో ఐదుగురికి జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా ఐదుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిని కోర్టులో హాజరుపర్చగా.. గంగాధర్ అనే వ్యక్తికి నాలుగురోజుల జైలుశిక్ష, మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

రుద్రూర్‌లో అక్రమ లేఅవుట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

అక్షరటుడే, కోటగిరి: రుద్రూర్ గ్రామంలో తమ భూమిలోకి చొరబడి అక్రమంగా ప్లాట్లు చేస్తున్నారని బాధితురాలు అనురాధ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అనురాధ మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే సంబర్లు 884, 923లలో ఉన్న తమ పట్టా భూమితో పాటు, పాత కాలువ, కాలువ బఫర్ జోన్ భూములను ఆక్రమించి అక్రమంగా లేఅవుట్ చేస్తున్నారన్నారు. గుర్ల ప్రమోద్ అనే వ్యక్తి సర్వే నంబర్లు 899/AA, 900/AA, 902, 903లలో వేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం తమ భూముల్లో రోడ్లు వేస్తూ, భూమిని సరిచేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. సరిహద్దులు, రోడ్డు మార్గాలు మరియు కాలువ స్థలాలను సమగ్రంగా పరిశీలించే వరకు ఈ లేఅవుట్‌కు ఎలాంటి తుది అనుమతులు ఇవ్వవద్దని, ఆక్రమణదారులపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను విజ్ఞప్తి చేశారు.